

'తమ్ముడా' మజాకా

టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం నిర్వాకాలు విస్తుగొలుపుతున్నాయి.

10లో



చీనీ టన్ను రూ.14 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.14 వేలు పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.5°/21.2°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఏసీబీ వలలో సీనియర్ ఆడిటర్

- రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం



ఏసీబీకి పట్టుబడిన సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ, స్వీపర్ నూర్ మహమ్మద్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా ఆడిట్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ, పార్ట్ టైమ్ స్వీపర్ నూర్ మహమ్మద్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. బుధవారం ఓ రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కలెక్టరేట్ సమీపంలోని రాజేంద్ర మునిసిపల్ హైస్కూల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన బుల్లె శ్రీనివాసులు ఈ ఏడాది మే 31న ఉద్యోగ విరమణ చేశారు. పెన్షన్ కోసం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ఆడిట్ శాఖ కార్యాలయంలో సంప్రదించారు. ఫైలు పెట్టడానికి సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.8 వేలకు ఒప్పుకున్నారు. లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు బుల్లె శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ కర్నూలు డీఎస్పీ సోమన్న నేతృత్వంలో ఏసీబీ అధికారులు వల పన్నారు. ఇందులో భాగంగా బాధితుడు బుధవారం లంచం డబ్బు తీసుకుని ఆడిట్ కార్యాలయానికి వెళ్లారు. సీనియర్ ఆడిటర్‌కు ఇవ్వబోగా.. స్వీపర్ నూర్ చేతికి ఇవ్వాలని సూచించారు. అతను డబ్బు తీసుకుంటున్న సమయంలోనే ఏసీబీ అధికారులు దాడి చేశారు. సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ, స్వీపర్ నూర్‌ను అరెస్టు చేసి కర్నూలు ఏసీబీ కోర్టుకు తరలించారు.

'అదనపు' బాధ్యతలు నిర్వర్తించలేం

- జేడీఏతో మొరపెట్టుకున్న ఏఈవోలు

అనంతపురం అగ్రికల్చర్: ఈ-క్రాప్ గురించి వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిశారు. తక్కువగా ఈ-క్రాప్ నమోదయిన మండలాలు, గ్రామాలకు తమను నియమించడం పట్ల అభ్యంతరం తెలిపారు.ఉన్నఫళంగా కొత్త ప్రాంతాలకు వెళ్లి ఈ-క్రాప్ చేయడం కష్టమని చెప్పారు. ఈ నెల 25లోపు ఈ-క్రాప్ పూర్తి చేయాలనే నిబంధన పెట్టారని, ఇంత తక్కువ సమయంలో తమ వల్ల కూడా కాదని అన్నారు. ఆయా మండలాల్లోని ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లకే అప్పగించాలని కోరారు. అయితే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో తప్పనిసరిగా అదనపు బాధ్యతలు తీసుకుంటేనే గడువులోపు ఈ-క్రాప్ పూర్తవుతుందని జేడీఏ తెలిపారు. అక్కడికి వెళ్లడం తప్ప మరో మార్గం లేదని తేల్చిచెప్పారు.

పోరుబాటలో మేము సైతం

- వైఎస్సార్ సీపీ 'కోటి సంతకాల సేకరణ'కు విశేష స్పందన
- వెల్లువలా తరలివచ్చి సంతకాలు చేసిన విద్యార్థులు, యువత
- రాజకీయాలకతీతంగా మద్దతు తెలిపిన ప్రజలు



కోటి సంతకాల సేకరణ శిబిరం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, చిత్రంలో అనంత తదితరులు

అనంతపురం: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాట ప్రభం'జనం'లా మారుతోంది. కూటమి సర్కారు నిరంకుశ నిర్ణయాన్ని నిరసిస్తూ ప్రజలు వెల్లువలా తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిర్వహించిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని 'అనంత' ప్రారంభించి తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో శిబిరం వద్దకు వచ్చి సంతకాలు చేశారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా ప్రజలు, నాయకులు, ప్రజా సంఘాల నేతలు మద్దతు తెలిపి సంతకాలు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ సంతకం చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే ఆలోచనను చంద్రబాబు విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ మెడలు వంచుదాం

కోటి సంతకాల సేకరణ శిబిరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బాబు కుట్రలకు అడ్డుకట్ట వేసే బాధ్యతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకుందన్నారు. అందరూ కలసికట్టుగా ప్రభుత్వం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అవకాశాలు దక్కవన్నారు. ఏ నాయకుడి ఆలోచనైనా ప్రజలకు మేలు చేసేలా ఉంటే దాన్ని విజన్ అంటారని, కానీ దురదృష్టవశాత్తు చంద్రబాబు విజనరీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రజలకు మెరుగైన వైద్యం, వైద్య విద్య అందించాలని భావించి రూ.8 వేల కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కోవిడ్‌తో అడ్డంకులొచ్చినా ఏడు కళాశాలల నిర్మాణం పూర్తి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలోనే ఐదు మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని, నిర్మాణాలు పూర్తయినా ఎన్నికల కోడ్‌తో రెండు కళాశాలలు అందుబాటులోకి రాలేదని చెప్పారు. అలాంటి కళాశాలలను నేడు చంద్రబాబు తన బంధువులు, పార్టీ వాళ్లకు హస్తగతం చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు దాసరి వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రా రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ రాష్ట్రనాయకులు రమేష్ గౌడ్,కాగజ్‌ఘర్ రిజ్వాన్, వెన్నం శివారెడ్డి, ఎగ్గుల శ్రీనివాసులు, రాధాకృష్ణ, జానీ, పెన్నోబులేసు, కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, ఆలమూరి శ్రీనివాస రెడ్డి, మల్లెమీద నరసింహులు, ఓబిరెడ్డి, అమర్‌నాథ రెడ్డి, కృష్ణవేణి, షేక్ సలాం బాబా, మీసాల రంగన్న, కేవీ రమణ, గంగాధర్, నాగార్జున రెడ్డి, చింతకుంట మధు, ప్రియాంక, భారతి, రాధా యాదవ్, అంజలి, జాహ్నవి, శోభాబాయి, సుజాత శ్రీనివాస్ దత్త, సాకే చంద్రలేఖ, కేశవరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, విద్యార్థి నాయకులు కైలాష్, కార్పొరేటర్లు శ్రీనివాసులు, శేఖర్ బాబు, సంపంగి రామాంజినేయులు, కమల్ భూషణ్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న ఓ వృద్ధుడు





ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకం చేస్తున్న సీపీఐ నేత జగదీష్, విద్యార్థులు




మద్దతు తెలిపి సంతకం చేస్తున్న ఓ దివ్యాంగుడు

అన్యాయం.. అప్రజాస్వామికం



అనంతపురం: ఇటీవల రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోంది. ఈ వ్యవహారంలో నిజాలు నిగ్గుతేల్చేలా 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వైఫల్యాలను 'సాక్షి' ఎత్తి చూపుతోందనే అక్కసుతో సర్కారు పెద్దలు రెచ్చిపోతున్నారు.పోలీసుల సాయంతో ప్రజా గొంతుకగా ఉండే 'సాక్షి'ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. అయితే, ప్రజల పక్షాన నిలుస్తున్న జర్నలిస్టుల గొంతును నొక్కేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమని జర్నలిస్టు సంఘాల నేతలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. కక్ష సాధింపు చర్యలు, అణచివేత విధానాలకు పాల్పడడం, అక్రమ కేసులు పెట్టడం సరి కాదంటున్నారు.

వాస్తవాలు తెలియజేయడమే నేరమా?



ప్రజలకు నిజాలు చెప్పడం మీడియా కర్తవ్యం. అలా చేయయడమే నేరమని ప్రభుత్వం భావిస్తోంది. పత్రికా స్వేచ్ఛను హరించిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాధించలేదని చరిత్ర చెబుతోంది. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

– రాచమల్లు భోగేశ్వర రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు

ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి



'సాక్షి' గొంతునొక్కే చర్యను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. పత్రికా స్వేచ్ఛను ఖూనీ చేయాలని చూస్తే సహించబోం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలువబడే మీడియాపై దాడులు చేయడం పిరికిపంద చర్య. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా పత్రికా విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

– కేపీ కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ప్రభుత్వ తీరు సరికాదు



జర్నలిస్టులు వారికి అందిన సమాచారం ప్రకారం వార్తలు రాస్తుంటారు. నకిలీ మద్యం గురించి ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించి విచారణ చేయించాల్సిన అవసరం ఉంది. అంతేకానీ వార్తలు రాసిన జర్నలిస్టులు లేదా పత్రికా ఎడిటర్, యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వడం సరికాదు. దీన్ని జర్నలిస్టులను బెదిరించే ధోరణిగా భావించాల్సి ఉంటుంది.

– రేపటి రామాంజినేయులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి

టమాట.. నష్టాల బాట

- నెలన్నర రోజులుగా రైతులకు దక్కని గిట్టుబాటు ధరలు
- కిలో రూ.15 లోపు పలుకుతుండటంతో దక్కని పెట్టుబడి

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో 19 వేల హెక్టార్లలో రైతులు టమాట పండిస్తున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 12 వేల హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 7 వేల హెక్టార్లు ఉన్నాయి. 7 లక్షల టన్నుల దిగుబడితో అన్నమయ్య తర్వాతి స్థానంలో అనంత జిల్లా ఉండడం గమనార్హం. ఎకరాకు 14 నుంచి 18 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. కట్టెలు, తీగలు కట్టిన టమాట పంటలో ఎకరాకు రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి వస్తుండగా... మామూలు పద్ధతిలో ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. కిలో రూ.22 నుంచి రూ.25 పలికితే పెట్టుబడి పోయి కొంత వరకు మిగులుతుందని అంటున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలతో కూలీలు, రవాణా ఖర్చులు, మార్కెట్‌లో కమీషన్లకు కూడా రాబడి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆరంభంలో ఊరించి..

సీజన్ ఆరంభం జూన్, జూలై, ఆగస్టులో మార్కెట్‌లో టమాట ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే సెప్టెంబర్, అక్టోబర్‌లో మార్కెట్ పరిస్థితి తారుమారు అయింది. ధర గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురంలోని కక్కలపల్లి మార్కెట్‌లో 15 కిలోల బాక్సు ధర గరిష్ఠంగా రూ.270 ఉండగా కనిష్ఠం రూ.130 ప్రకారం పలుకుతోంది. సగటున రూ.200తో క్రయవిక్రయాలు సాగుతున్నాయి. గరిష్ఠ ధర కూడా నాణ్యమైన కొన్ని లాట్లకు మాత్రమే లభిస్తోంది. మిగతావన్నీ రూ.100 నుంచి రూ.200 మధ్య పలుకుతుండడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం రోజూ మార్కెట్‌కు 2 వేల నుంచి 3 వేల టన్నుల వరకు సరుకు వస్తోంది.



ఆత్మకూరు సమీపంలో పశువులకు వదిలేసిన టమాట పంట

అంతటా ఇదే పరిస్థితి!

మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలా మంది రైతులు.. కూలీలు, రవాణా ఖర్చు మిగులుతుందనే ఉద్దేశంతో టమాట కోతలకు స్వస్తి పలికారు. దీంతో పొలాల్లోనే పంటను పశువులకు వదిలేశారు. ఇప్పటికే 60 శాతం పంట పూర్తి కాగా, మరో 40 శాతం మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వర్షాలకు తడిసినవి, మచ్చ ఉన్న కాయలను కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. టమాట సాగులో అన్నమయ్య తర్వాత రెండో స్థానంలో 'అనంత' ఉండగా ఆ తర్వాత చిత్తూరు, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. కాగా, అనంతపురం , చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు జిల్లా పరిధిలోని టమాట మార్కెట్లలో ధరల పరిస్థితి కూడా ఇలాగే ఉందని రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రూప్‌కుమార్ తెలిపారు.

ఒక్క కిలో కూడా అమ్ముడుపోలేదు



ఈ ఏడాది 3 ఎకరాల్లో టమాట సాగు చేశా. రూ.2.70 లక్షల వరకు పెట్టుబడులు అయ్యాయి. తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో మచ్చలు, ఇతర తెగుళ్ల వ్యాపించి పరిస్థితి తారుమారయింది. ధరలు తగ్గుముఖం పట్టి మార్కెట్‌లో అమ్ముడుపోవడం లేదు.

– రైతు రుక్మాంగధరెడ్డి, బొమ్మగానిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

పరిస్థితి దారుణం



ఎకరాకు రూ.50 వేల పెట్టుబడితో దశల వారీగా 10 ఎకరాల్లో టమాట సాగు చేశాను. ఇప్పటికే ఐదు ఎకరాల పంట పూర్తయింది. ధరలు చూస్తే దారుణంగా ఉన్నాయి. పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదు. ఏడాది పొడవునా గిట్టుబాటు ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కందుల పుల్లారెడ్డి, రైతు, ఆత్మకూరు

మరీ ఇంత నిర్లక్ష్యమా?

- సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యంపై కలెక్టర్ ఆనంద్ ఫైర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం మెడికల్: 'ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏడాదిలో 69 వేల మంది రోగులు వైద్యం పొందగా అందులో కేవలం 29 వేల మందిని ఎన్‌టీఆర్ వైద్య సేవల కింద నమోదు చేశారు. కనీసం ఆస్పత్రికి వచ్చిన వారిలో 50 శాతం మందిని కూడా నమోదు చేయకపోవడమేంటి? హెచ్‌డీఎస్‌లో రూ.1.7 కోట్లు ఉంటే రూ.10 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తారా..? ఎన్‌టీఆర్ వైద్య సేవ, అబా రిజిస్ట్రేషన్‌లోనూ ఎంతో వెనుకబడ్డారు. మరీ ఇంత నిర్లక్ష్యమైతే ఎలా' అంటూ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యంపై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కలెక్టర్ అధ్యక్షతన హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నిధులతో ఏవి అత్యవసరమో వాటినే అజెండాలో చేర్చాలి కానీ అందరూ ఇచ్చిన వాటిని నమోదు చేయడం సరి కాదన్నారు. అబా రిజిస్ట్రేషన్ కేవలం 50 శాతమే నమోదైనట్లు లెక్కల్లో చూపుతున్నారని, ఏళ్ల గడుస్తున్నా అందులో పురోగతి ఉండదా అని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలారు. ఏసీలు కొనుగోలు చేయడంతో పాటు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోగులకందే సేవల్లో నాణ్యత పెంచాలన్నారు. బయోవేస్టేజ్‌ను సరిగా తీసుకెళ్లకపోవడంతో ఇన్‌ఫెక్షన్స్ సోకే ప్రమాదం లేకపోలేదని హెచ్‌డీఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రికి 50 వీల్ చైర్లను అందిస్తామని హెచ్‌డీఎస్ సభ్యుడు రమణ తెలిపారు. సమావేశంలో హెచ్‌డీఎస్ కో చైర్మన్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడెక్ట్, హెచ్‌డీఎస్ సభ్యులు విశాల ఫెర్రర్ పాల్గొన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యేను అడ్డుకున్న కార్మికులు..

తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదంటూ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికులు స్పష్టం చేశారు. కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ముందు వారు అడ్డుకున్నారు. వైఎస్సార్ సీపీనా.. టీడీపీనా అంటూ నూతన ఏజెన్సీ నిర్వాహకులు తమకు ముచ్చెమటలు పట్టిస్తున్నారని వాపోయారు. అరగంట పాటు వారిని కదలనివ్వలేదు.

వలస కూలీ దుర్మరణం

బ్రహ్మసముద్రం: బతుకు తెరువు కోసం కర్ణాటకకు వలస వెళ్లిన ఓ యువకుడు అక్కడ చోటు చేసుకున్న ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి గ్రామానికి చెందిన వడ్డె గురుస్వామి (35) బతుకు తెరువు కోసం కర్ణాటకు వలస వెళ్లాడు. అక్కడ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి చెళ్లకెర తాలూకా చిత్రనాయకనహళ్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. కాగా, గురుస్వామికి భార్య శిల్ప, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తమ్ముడా మజాకా

- మానసిక వికలాంగుల కేటగిరీలో పింఛన్
- టీఎన్‌టీయూసీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం నిర్వాకం
- అర్హులకు మాత్రం మొండిచెయ్యి



ఈ అమ్మాయి పేరు సారిక. మల్టిపుల్ డిజేబుల్డ్. తండ్రి నాగరాజు. ఈ అమ్మాయికి దివ్యాంగ కోటాలో నెలకు రూ.6 వేలు పింఛన్ వస్తోంది. అయితే..గత నెలలో పింఛన్ తొలగింపునకు నోటీసు ఇచ్చారు. వైకల్య శాతం తక్కువగా ఉందని, రీ వెరిఫికేషన్ చేయించుకోవాలని నోటీసులో పేర్కొన్నారు.



ఈయన పేరు నాగభూషణ. అనంతపురం తపోవనంలో ఉంటున్నాడు. పక్షవాతంతో బాధపడుతున్నాడు. చేతులు, కాళ్లు పూర్తిగా పని చేయవు. మరొకరు సహాయకారిగా ఉండాల్సిందే. నెలకు రూ.15 వేలు పింఛన్ వస్తోంది. ఈయనకూ పర్సెంటేజీ తక్కువ చూపించి నోటీసు ఇచ్చారు. పదేళ్లకు పైగా పింఛన్ తీసుకుంటున్న తనకు ఈరోజు తొలగింపునకు నోటీసు ఇచ్చారంటూ బాధితుడు వాపోతున్నాడు.

..ఇలా జిల్లా వ్యాప్తంగా ఎందరో అర్హులైన దివ్యాంగులు తమ పింఛన్లు రద్దవుతాయనే ఆందోళనలో సతమతమవుతున్నారు. అయితే టీడీపీ నేతలు, కార్యకర్తలు మాత్రం తమకు అర్హత లేకున్నా దర్జాగా సామాజిక పింఛన్లను పొందుతుండడం గమనార్హం.



టీడీపీ నేతలతో తాడాల నాగభూషణం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన తాడాల నాగభూషణం నాలుగు చక్రాల వాహనాల మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైంది. దీన్ని ఆసరాగా చేసుకుని మానసిక వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ పొందాడు. అప్పట్లో వైద్యులపై ఒత్తిడి చేయించి ఈ సర్టిఫికెట్ పొందాడనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అప్పటి నుంచి దాదాపు పదేళ్లుగా దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందుతున్నాడు. తొలుత నెలకు రూ.1,500 వచ్చేది. ఆ తర్వాత రూ.3 వేలు, ఇప్పుడు రూ.6 వేలు వస్తోంది.



ఇదిగో ఈ ఫొటో బాగా పరిశీలించండి. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇటీవల రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన 'ఆటోడ్రైవర్ సేవలో' కార్యక్రమం ప్రారంభించిన సందర్భంలో తీసిన ఫొటో ఇది. ఎమ్మెల్యే పక్కన ఉన్న వ్యక్తి (సర్కిల్‌లో) టీఎన్‌టీయూసీ (తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు తాడాల నాగభూషణం. ఈయన మానసిక వ్యాధితో బాధపడుతున్నాడట! దివ్యాంగ కోటాలో (పింఛన్ ఐడీ 112723626) ప్రతినెలా రూ.6 వేల పింఛను తీసుకుంటున్నాడు. ఇటీవల జిల్లాలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిలో 9,601 మందికి ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. వారందరూ మరోమారు వైద్యుల వద్ద వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆదేశించింది. వీరిలో చాలామంది తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వారే. ఈ జాబితాలో టీఎన్‌టీయూసీ నేత తాడాల నాగభూషణం పేరు మాత్రం లేదు.

మానసిక రోగి...ఇంత యాక్టివ్ ఎలా?

ఈయన మానసిక రోగిగా ఉంటూ ఇంత యాక్టివ్‌గా ఎలా ఉంటున్నాడనేది ప్రశ్న. అంతేకాదు రాప్తాడు ఆటోనగర్ ప్రెసిడెంట్‌గానూ పని చేశాడు. ప్రస్తుతం గౌరవాధ్యక్షుడిగా ఉన్నాడు. తెలుగుదేశం పార్టీ అనుబంధంగా ఉన్న టీఎన్‌టీయూసీ పార్లమెంటు అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. నాగభూషణం అక్రమంగా పొందుతున్న పింఛన్‌పై గతంలోనూ పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. వందశాతం వైకల్యం కల్గిన అసలైన బాధితుల నోట్లో మట్టి కొట్టేందుకు సిద్ధమైన కూటమి సర్కారు.. తాడాల నాగభూషణం వంటి వారి విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి : కలెక్టర్



ఏపీఐఐసీ పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని ఏపీఐఐసీ అధికారులను కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఆవిష్కరించి, మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందు కోసం బుధవారం నుంచి నెలరోజుల పాటు జిల్లావ్యాప్తంగా ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్టనర్ షిప్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్‌వీఎస్ఎస్ నాగకుమార్, మేనేజర్ మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే టపాసుల విక్రయాలు

దీపావళిని పురస్కరించుకుని టపాసుల విక్రయాలు ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. టపాసుల విక్రయాలపై జిల్లా యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుంచి డీఆర్‌ఓ మలోలతో కలిసి ఎస్పీ జగదీష్, డివిజన్‌స్థాయి అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, అగ్నిమాపక, విపత్తు, విద్యుత్, ఆరోగ్య, వాణిజ్య పనుల శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నిబంధనల మేరకు దుకాణాలు ఉండేలా చర్యల తీసుకోవాలని ఆదేశించారు.

పర్యాటక అభివృద్ధి లక్ష్యం

జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధి లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. పర్యాటక స్థలాల అభివృద్ధిపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, పర్యాటక సంరక్షణ సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. తాడిపత్రి, ఉరవకొండ, అనంతపురం, కసాపురం, గుత్తికోట, పెన్నహోబిలం, పెనకచెర్ల, వజ్రకరూరు, గూగూడు, హంపాపురం, తదితర పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు, ఛారిటీలు, తదితర సేవ సంస్థలు ముందుకు రావాలని సూచించారు. జిల్లాలో డిజిటల్ టూరిజాన్ని పోత్సాహించాలన్నారు. నగరంలో శిల్పారామాన్ని అభివృద్ధి చేసి స్థానిక కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శన, విక్రయాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో పర్యాటక శాఖాధికారి జయకుమార్, డీఈఓ ప్రసాద్‌బాబు, డ్వామా పీడీ సలీంబాషా, శిల్పారామం మేనేజర్ శివారెడ్డి, చరిత్ర ప్రొఫెసర్ సుధాకర్, పర్యాటక సంరక్షణ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శిశువు మృతి కారకులను ఉపేక్షించారా?

అనంతపురం రూరల్: శిశుగృహలో నవజాత శిశువు మృతికి కారణమైన వారిని ఉన్నతాధికారులు ఉపేక్షించారా? లేదా శిక్షిస్తారా? అనేది మిస్టరీగానే ఉంది. ఈ నెల 3న శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ అంశంపై ఈ నెల 5న డీఎంహెచ్ఓ, ఐసీడీఎస్ పీడీ, జీజీహెచ్ వైద్యుడితో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ కొనసాగింది. ఆ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సైతం ఈ నెల 6న శిశుగృహలో విచారణ చేపట్టి ఈ నెల 7 న ఐసీడీఎస్ పీడీ నాగలక్ష్మిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శిశువు మృతికి కారణమైన శిశుగృహ సిబ్బందిపై కూడా విచారణ జరుగుతోందని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలుంటాయని అందరూ భావించారు. అయితే రోజులు గడుస్తున్న కొద్దీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ అంశాన్ని అక్కడితో ఉన్నతాధికారులు తొక్కిపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఇదే అంశంపై ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ అరుణకుమారి మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారందరిపై కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని...

రాప్తాడు రూరల్: మద్యం తాగేందుకుని భార్య డబ్బు ఇవ్వకపోవడంతో భర్త అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ వైఎస్సార్ కాలనీలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. దూదేకుల మహమ్మద్ సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో మద్యం తాగేందుకు డబ్బు కావాలంటూ తరచూ భార్య బీబీని వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 5న మద్యం తాగేందుకు రూ.500 కావాలని భార్యను అడిగాడు. ఆమె తన వద్ద లేవని తెలపడంతో గొడవపడి అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య బీబీ బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

నకిలీ మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు

- ప్రతి మూడింటిలో ఒక బాటిల్ నకిలీ మద్యమే
- పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు అక్రమ కేసులు పెట్టిస్తున్నారు
- సీబీఐ విచారణ జరపాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం: నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలా మార్చి, కూటమి పెద్దల కనుసన్నల్లో రాష్ట్రమంతా పారించి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. నకిలీ మద్యం కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రంగాలు కల్తీమయం అయ్యాయన్నారు. కల్తీ మద్యం వ్యవహారంలో ఫేక్ వీడియో సృష్టించి, పక్షపాత దర్యాప్తు చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబు తప్పుడు వార్తలు రాయిస్తూ, దొంగ డిబేట్లు పెట్టిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. మద్యమే కాకుండా.. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు.. ఇలా అన్నీ కల్తీ చేస్తున్నారని, చివరకు చంద్రబాబు, ఆయన పార్టీ కూడా కల్తీనే అని విమర్శించారు. ఎక్సైజ్ శాఖ నుంచి వచ్చే ఆదాయం నాలుగు అణాలు ఖజానాకు వెళితే.. 12 అణాలు చంద్రబాబు జేబులోకి వెళ్తోందనే విషయాన్ని మరవకూడదన్నారు. ప్రతి పల్లెలో నాలుగైదు బెల్టుషాపులు ఉన్నాయని, చంద్రబాబు ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీ ప్లాంట్లు ఏర్పాటయ్యాయని ఆరోపించారు. ఇందులో తయారైన మద్యం అన్ని షాపుల్లోకి చేరిందన్నారు. ప్రతి మూడు మద్యం బాటిళ్లలో ఒకటి నకిలీ బాటిలే అన్నారు. నకిలీ మద్యం మకిలిని వైఎస్సార్‌సీపీకి అంటగట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు.

పోలీసు ఆఫీసర్లే వీడియో రికార్డు చేయించారు


'నకిలీ మద్యం వ్యవహారంలో పోలీసు వ్యవస్థ ఒక వ్యక్తిని అరెస్ట్ చేసింది. వెంటనే అతని వద్ద ఉన్న వస్తువులన్నింటినీ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తారు. కానీ స్వయంగా పోలీసు ఆఫీసర్లే అతనితో వీడియో రికార్డు చేయించారు. అది కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా అతనితో మాజీ మంత్రి జోగి రమేష్‌పై ఆరోపణలు చేయించారు. ఇది చాలా దుర్మార్గం' అని గోరంట్ల మాధవ్ అన్నారు. ప్రభుత్వం పోలీసుల పట్ల ఎలా వ్యవహరిస్తోందో అందరూ గమనించాలన్నారు. ఇప్పటికే ఐపీఎస్ అధికారులు అరెస్ట్ అయ్యారని, మరికొందరు సస్పెండ్ అయ్యారని, ఇంకొంత మంది రాష్ట్రం వదలి వెళ్లిపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఐపీఎస్ అధికారులు కళ్లు తెరవాలన్నారు. చంద్రబాబు ఉచ్చులో పడొద్దన్నారు. చంద్రబాబు అక్రమంగా సంపాదిస్తూ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని, ఈ అంశాన్ని బీజేపీ, పవన్‌కల్యాణ్ గుర్తించాలన్నారు. కర్నూలు పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ ఈ విషయాలన్నింటినీ గమనించాలన్నారు. చంద్రబాబు దోపిడీపై పవన్‌కళ్యాణ్, బీజేపీ నేతలు ప్రధానికి ఫిర్యాదు చేయాలన్నారు.

నేటి నుంచి సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లు

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం స్పోర్ట్స్ సెంటర్ వేదికగా గురువారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకూ సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. అండర్ -23 విభాగంలో ఆంధ్ర, ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రధాన మైదానంలో జరిగే ఈ మ్యాచ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బుధవారం మ్యాచ్ ఆఫీషియల్స్ మైదానాన్ని పరిశీలించారు. ఉదయం 9 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. మ్యాచ్ రెఫరీగా సంజయ్ వర్మ, అంపైర్లుగా ఆనంద్ ఎం ఓవాల్కర్, సదాశివ్ అయ్యర్ వ్యవహరించనున్నారు.

పీఎం సభకు వస్తారా? లేదా!

- జనసమీకరణలో అధికార యంత్రాంగం
- 8 వేల మంది వ్యాపారులకు కలెక్టరేట్ నుంచి ఫోన్‌కాల్స్



ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వ్యాపారులకు ఫోన్ చేస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది' అనే చందంగా మారింది జిల్లా అధికారుల పరిస్థితి. కర్నూలు జిల్లాలో గురువారం నిర్వహించనున్న సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్న నేపథ్యంలో తన ప్రాబల్యం చూపించుకునేందుకు సీఎం చంద్రబాబు భారీ జనసమీకరణకు అధికారులను పురమాయించారు. ఈ క్రమంలో జిల్లా నుంచి 1,500 మంది వ్యాపారులను సభకు పంపేలా 'టార్గెట్' విధించారు. జిల్లాలో ఈ బాధ్యతను తీసుకున్న డీఆర్‌డీఏ, మెప్మా, నగర పాలక సంస్థ, డ్వామా, జిల్లా పంచాయతీ శాఖ అధికారులు వెంటనే రంగంలో దిగి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 50 మందిని సిబ్బందిని ఏర్పాటు చేసి, 8 వేల మంది వ్యాపారుల ఫోన్ నంబర్ల జాబితాను అందించి, అందరికీ ఫోన్లు చేయించారు. దీంతో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీసీ హాల్‌తో పాటు ఆరుబయట ప్రాంతంలోనూ ఫోన్ కాల్స్ చేస్తూ సిబ్బంది తలమునకలయ్యారు. కేవలం వ్యాపారుల కోసమే ప్రత్యేకంగా ఒక్కో అర్బన్ మున్సిపాలిటీ నుంచి 100 మంది చొప్పున 500 మందిని, నగర పాలక సంస్థ పరిధి నుంచి 300 మంది, రూరల్ మండలాల నుంచి 700 మంది చొప్పున మొత్తం 1,500 మందిని తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. రూరల్ మండలాలకు చెందిన 700 మందికి 14 బస్సులు కేటాయించారు. అలాగే గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, అనంతపురం నగర పాలక సంస్థ నుంచి 800 మందికి 16 బస్సులు ఏర్పాటు చేశారు.

ఉన్నది 511, పంపింది 318

అనంతపురం క్రైం: కర్నూలులో నేడు జరిగే ప్రధాని మోదీ కార్యక్రమానికి బస్సులను ఇష్టారాజ్యంగా పంపడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అనంతపురం రీజియన్ పరిధిలో 511 బస్సులుంటే 318 బస్సులను తరలించారు. బస్సులు ఉండవన్న ముందస్తు సమాచారం లేక చాలా మంది గ్రామీణులు నగరంలో ఉండిపోవాల్సి వచ్చింది.

- నేత్రదానం



నేత్రాలను అందజేస్తున్న రామాంజనేయులు కుటుంబసభ్యులు

శింగనమల(నార్పల): మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించారు నార్పలకు చెందిన రామాంజనేయులు కుటుంబసభ్యులు. బుధవారం తెల్లవారుజామున రామాంజనేయులు గుండెపోటుతో మృతి చెందారు. అంతటి విషాదంలోనూ బాధిత కుటుంబ సభ్యులు సహృదయంతో ఆలోచించి మృతుడి నేత్రాలను దానం చేస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి తెలిపారు. దీంతో సొసైటీ బృందం అక్కడకు చేరుకుని రామాంజనేయులు మృతదేహం నుంచి నేత్రాలను సేకరించింది. నేత్రాలను దానం చేసిన రామాంజనేయులు భార్య రాజేశ్వరి, కుమారుడు త్రిగుణ, చెల్లెళ్లు భారతి, శ్రీదేవిని పలువురు అభినందించారు.

మహిళలతో మందుబాబుల అనుచిత ప్రవర్తన

కళ్యాణదుర్గం: మండలంలోని నారాయణపురం గ్రామంలో మందుబాబులు రాత్రి సమయాల్లో హంగామా చేస్తున్నారు. మద్యం సేవిస్తూ అటుగా వెళుతున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా మంగళవారం రాత్రి స్థానిక పాత అంగన్‌వాడీ కేంద్రం వద్ద పూటుగా మద్యం సేవించిన గ్రామానికి చెందిన పి.రామాంజనేయులు, జి.రామాంజనేయులు అనే ఇద్దరు యువకులు నానా హంగామా చేశారు. కొల్లాపురమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలను అసభ్యంగా మాట్లాడుతూ కవ్వింపు చర్యలకు దిగారు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. వేళాపాళ లేకుండా గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నారని, ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం సేవించి గ్రామంలోని యువకులు పెడదోవ పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

25 లోపు ఈ-క్రాప్ చేయించుకోండి : జేడీఏ

గార్లదిన్నె: ఈ నెల 25వ తేదీ లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని పంటలు సాగు చేసిన రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గార్లదిన్నె మండలం కమలాపురం, మర్తాడు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏడీ అల్తాఫ్ అలీఖాన్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు పంటలకు ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది అనూష, మహేశ్వరి, శశిధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ మేరకు బుధవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మీసుగ సుబ్బయ్య, ఈశ్వరమ్మ దంపతుల ఇంట్లో మంగళవారం రాత్రి వారి మనవరాలు, ఆమె భర్త గొడవపడ్డారు. ఈశ్వరమ్మ సర్ది చెప్పేందుకు ప్రయత్నించింది. కాసేపటి తర్వాత బయటకు వచ్చిన ఆమె కళ్లు తిరుగుతున్నాయంటూ కుప్పకూలింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. దీంతో ఈశ్వరమ్మ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ భర్త సుబ్బయ్య చేసిన ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

రాప్తాడు: మండలంలోని గంగలకుంట గ్రామ రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.... నార్పలకు చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి లక్ష్మీనారాయణ (75) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులకు భారం కాకూడదని భావించిన ఆయన బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, లక్ష్మీనారాయణకు భార్య నారాయణమ్మ, ఓ కుమార్తె ఉన్నారు. ధర్మవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

కనగానపల్లి: ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలో హంద్రీ-నీవా కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం కనగానపల్లి మండలం బాలేపాళ్యం సమీపంలో కాలువలో బయటపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన నాగభూషణ (65) రెండు రోజుల క్రితం పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో ఈత కొడుతూ నీటి ప్రవాహనికి కొట్టుకుపోయాడు. దీంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు కాలువ వెంబడి పరిశీలిస్తూ ముందుకు సాగారు. బాలేపాళ్యం సమీపంలో హంద్రీనీవా కాలువలో బుధవారం కనిపించిన మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



వాణిని సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్

అనంతపురం రూరల్: పీవీకేకే ఐటీ కళాశాలలో సీఎస్సీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వీణాకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డు దక్కిందని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్ తెలిపారు. ఈ నెల 12న విజయవాడలో సొసైటీ ఆఫ్ లెర్నింగ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో అవార్డు అందజేశారన్నారు. ఈ మేరకు ఆమెను బుధవారం కళాశాలలో చైర్మన్‌తో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

హర్యానా పోలీసు అధికారుల తీరు అన్యాయం

అనంతపురం రూరల్: హర్యానా ఐపీఎస్ అధికారి పూరన్ ఆత్మహత్యకు కారణమైన పోలీసు ఉన్నతాధికారుల తీరు దారుణమని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఈడబ్ల్యూఏ అధ్యక్షుడు కటిక జయరాం అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భద్రత లేకుండా పోయిందన్నారు,. హర్యానాలో ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్‌ను మానసిక వేదనకు గురి చేసి.. ఆత్మహత్య చేసుకునేలా అక్కడి పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు యావత్ దేశానికి అవమాన కరమన్నారు. ఐపీఎస్ అధికారికే భద్రత లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో కమిటీ నాయకులు గంగాధర్, సునీల్, ప్రకాష్‌బాబు, రాజారమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యామూర్తికి జీవిత సాఫల్య పురస్కారం



సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్: ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ నృత్యంలో విశేష సేవలందిస్తున్న వారికి వేర్వేరు విభాగాలలో జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తున్నారు. అందులో భాగంగా నగరానికి చెందిన సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తికి 'లంక అన్నపూర్ణ దేవి జీవిత సాఫల్య పురస్కారం' అందిస్తున్నట్లు సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్సు సంస్థ నిర్వాహకులు పెద్దప్రోలు భావన తెలిపారు. ఈ నెల 18న కూచిపూడి గ్రామంలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారి కళాక్షేత్రంలో అవార్డు అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రతిష్టాత్మక అవార్డుకు సంధ్యామూర్తి ఎంపిక కావడం పట్ల నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు హర్షం వెలిబుచ్చారు.

గుత్తి కోట అభివృద్ధికి కృషి

అనంతపురం అర్బన్: పర్యాటకంగా గుత్తికోటను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌కు గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు విన్నవించారు. కలెక్టర్‌ను బుధవారం ఆయన చాంబర్‌లో సమితి సభ్యులు కలిసి సన్మానించి మెమొంటో అందజేశారు. గుత్తికోటకు గొప్ప చరిత్ర ఉందని, ఒకసారి సందర్శించాలంటూ ఆహ్వానించారు. పర్యాటక ప్రదేశంగా గుత్తికోటను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, సాంస్కృతిక విభాగం చైర్మన్ సాధుశేఖర్, సభ్యులు సూర్యనారాయణరెడ్డి, బాబాసాహెబ్, శివ, వీరేష్, రంగస్వామి, తదితరులు ఉన్నారు.

స్వర్ణోత్సవ స్నేహ సమ్మేళనం



సమావేశమైన 1975 బ్యాచ్ కానిస్టేబుళ్లు

అనంతపురం సెంట్రల్: పోలీసుశాఖలో దశాబ్దాల పాటు పనిచేసి ..ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం గడుపుతున్న కానిస్టేబుళ్లంతా ఒకచోట కలిశారు. బుధవారం డీపీఓ కార్యాలయం ఇందుకు వేదికగా మారింది. 1975 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు స్వర్ణోత్సవ స్నేహ సమ్మేళనాన్ని నిర్వహించారు. మొత్తం 42 మందికి గాను ప్రస్తుతం 19 మంది మాత్రమే జీవించి ఉన్నారు. వీరు సమావేశమై పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాత ఫొటోలు, ప్రస్తుత ఫొటోలతో కూడిన మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో బాబా ఫక్రుద్దీన్ (రిటైర్డ్ ఎస్ఐ), మహబూబ్‌బాషా, ఆంజనేయులు, క్రిస్టోఫర్, వెంకటేశులు, మహబూబ్‌పీరా, జహీర్ అహ్మద్, నబీరసూల్, లియాఖత్, అలీ, రామాంజనేయులు, అశ్వర్థప్ప, రామచంద్ర, కిష్టప్ప, చంద్రశేఖర్ కొండన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి

అనంతపురం రూరల్: ఏళ్ల తరబడి సాంఘిక సంక్షేమశాఖలో వసతి గృహాల వార్డెన్లుగా విధులు నిర్వహిస్తున్నామని తమకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని పలువురు వార్డెన్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) కుష్బూకొఠారిని కోరారు. బుధవారం బీసీ స్టడీ సర్కిల్‌లో డీడీని కలిసి వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబు కళ్లు తెరిపిద్దాం

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: 'పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కూటమి సర్కార్ పీపీపీ పద్ధతిలో అందులో 12 కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమైంది. ఈ కోటి సంతకాలు కార్యక్రమంలో చంద్రబాబు కళ్లు తెరిపిద్దాం' అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం రాప్తాడు మండలం భోగినేపల్లి, పాలచెర్ల, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ...పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడంతో పాటు నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులకు కలగా మారిన వైద్యవిద్యను చేరువ చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 నూతన మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టిందన్నారు. అందులో ఐదు కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మిగిన 12 కళాశాలలను ఈ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమైందన్నారు. అదే జరిగితే పేదవాడికి వైద్యం దూరమవుతుందన్నారు. కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కక్షగట్టి మరీ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

నకిలీ మద్యం పాపం చంద్రబాబుదే

రాష్ట్రంలో నకిలీ మద్యం పాపం చంద్రబాబుదేనని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. స్పిరిట్, నీళ్లు, రంగుపొడి కలిపి కావాల్సిన బ్రాండ్లు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారన్నారు. దీంతో పేదలు డబ్బు ఇచ్చి మరీ విషం కొనుగోలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మద్యం షాపుకంటే బెల్ట్ షాపులే అధికయ్యాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం బెల్ట్ షాపులను రద్దు చేయాలన్నారు. మద్యం తాగి మరణించిన వారికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాలన్నారు.

జగనన్నకు రాప్తాడును గిఫ్ట్‌గా ఇద్దాం

వచ్చే ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి జగనన్నకు గిఫ్ట్ ఇద్దామని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎం.బండమీదపల్లి గ్రామానికి రూ.కోటితో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్లు సాకే వెంకటేష్, నాగముని, పార్టీ యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, సర్పంచు ఉమాదేవి, ఉషారాణి, వరలక్ష్మీ, శివమ్మ, నాయకులు గంగుల సుధీర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఫక్కీరప్ప, సూర్యనారాయణ రెడ్డి, మారక సుబ్బారెడ్డి, చాగంటి నారాయణ రెడ్డి, గుగ్గిళ్ల ఓబిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, బండి శ్రీనివాసులు, బిల్లే రామకృష్ణ, సదానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుడి కాలువకు నీటిని విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం సెంట్రల్: పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరువులను వెంటనే నీటితో నింపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వర్షాలు రాకపోవడంతో కుడికాలువ కింద ఉన్న చెరువుల్లో నీరు లేక భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, సమీప గ్రామాల్లోని ప్రజలు భవిష్యత్‌లో తాగునీటికి కూడా ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. రాప్తాడు, ఉరవకొండ, శింగనమల, ధర్మవరం నియోజకవర్గాల్లోని ఈ చెరువులను నీటితో నింపితే రైతులు పంటలు సాగు చేసుకొని ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తారన్నారు. తక్షణం కుడికాలువకు 5 టీఎంసీలు నీటిని కేటాయించి 49 చెరువులను పూర్తిగా నీటితో నింపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రమేష్, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి నరేష్, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు ధనుంజయ, మన్నీల సూరి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ అంశాన్ని తొలగించాలి

అనంతపురం సిటీ: కేంద్ర ప్రభుత్వం 2025 ఆర్థిక సంవత్సర బిల్లులో పొందుపరచిన పెన్షన్ నియమాల ధ్రువీకరణ అంశాన్ని తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు కోరారు. ఈ మేరకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆయన స్వగృహంలో బుధవారం కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అందులో ఇంకా అనేక సమస్యలను ప్రస్తావించారు. వాటిని పార్లమెంట్‌లో చర్చించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆల్ ఇండియా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, టెలికాం శాఖ ప్రతినిధులు పద్మనాభాచారి, సుభాన్, బాబయ్య, బాలరంగయ్య, పోస్టల్, ఎల్ఐసీ, జాతీయ నమూనా సర్వే పెన్షనర్ల ప్రతినిధులు ఉన్నారు.

ఏపీ ఎన్‌జీఓ సభ్యత్వ నమోదు

అనంతపురం సెంట్రల్: ఎన్‌జీఓ నగరశాఖ ఆధ్వర్యంలో బుధవారం హంద్రీ–నీవా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మంది గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో హంద్రీ–నీవా ఎస్ఈ రాజాస్వరూప్, ఎన్‌జీఓ నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు ఎస్టీ అంశంపై ప్రకటన చేయాలి

అనంతపురం రూరల్: కర్నూలు పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వాల్మీకుల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్టీ పునరుద్ధరణ అంశంపై ప్రకటన చేయాలని వాల్మీకి ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, ఆల్ ఇండియా గెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీకి సౌమ్య

ఆత్మకూరు: స్థానిక కేజీబీవీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న సౌమ్య రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీమారోజ్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారని, ఇందులో పాల్గొన్న సౌమ్య అండర్–19 విభాగం సత్తా చాటిందన్నారు. దీంతో నిర్వాహకులు రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపిక చేశారన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని పరిటాల రవీంద్రకాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...అభిమన్యునాయక్ కుమార్తె జ్యోత్స్నబాయి వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపలపాయ ఐఐటీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఊరికి వచ్చిన జోత్స్నబాయి ఈనెల 13న ఉదయం 9 గంటలకు అనంతపురం నుంచి ఒకతే బస్సులో బయలుదేరి వెళ్లింది. కళాశాలకు ఫోన్ చేస్తే రాలేదని చెప్పారు. దీంతో కంగారుపడ్డ తల్లిదండ్రులు పలుచోట్ల గాలింపు చర్యలు చేపట్టినా ఉపయోగం లేకపోయింది. ఈ క్రమంలో బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఐసీడీఎస్ ఐదో సెక్టార్ పరిధిలోని సత్యదేవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు.సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు ప్రభావతి, శంకరమ్మ, సరస్వతి,శకుంతల తదితరులు పాల్గొన్నారు. గర్భిణులు, ప్రసూతి తల్లులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలన్నారు. శిశువుకు రోగ నిరోధకశక్తి పెరుగుదలకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. ఆర్నెల్ల తర్వాత తల్లిపాలతో పాటు ఇతర ఆహార పదార్థాలు అందివ్వాలన్నారు.

'తోపుదుర్తి చరిత్ర తెలుసుకుని మాట్లాడు'

రాప్తాడురూరల్: రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చరిత్ర తెలుసుకుని కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిల్లే మంజునాథ్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఒ ప్రకటన విడుదల చేశారు. ఆయన రాజకీయాల్లోకి రాకముందే రాప్తాడు నియోజకవర్గంలో రైతులకు ఉచిత బోర్లు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఉచిత డిష్ కనెక్షన్లు, గొర్రెలు, బర్రెలను తన సొంత నిధులతో తోపుదుర్తి ఇచ్చారని పేర్కొన్నారు. కందికుంట చెక్ బౌన్స్ వెంకటప్రసాద్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేదంటే వైఎస్సార్‌సీపీలో ఉన్న బీసీ నాయకులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు యశస్విని



యశస్విని

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన యశస్విని స్కూల్ గేమ్స్ క్రికెట్ అండర్–19 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటింది. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. యశస్విని చియ్యేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తండ్రి దేవర రామ్మోహన్, తల్లి సుభద్ర. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. త్వరలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో యశస్విని పాల్గొననుంది. ఆమెను పాఠశాల హెచ్ఎం విశ్వనాథ్, పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

క్రికెట్, బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం కార్పొరేషన్: నీలం సంజీవరెడ్డి స్టేడియంలో క్రికెట్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆవరణంలో బుధవారం బాస్కెట్‌బాల్ అండర్–19 జిల్లా జట్ల ఎంపిక జరిగాయి. ఎంపికైన జట్లు త్వరలో జరగబోయే అంతర్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటాయని కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని తెలిపారు.

క్రికెట్ బాలురు: సాత్విక్, భానుప్రసాద్, శేషు, విష్ణుభరత్, కుశాల్ సాయి, ప్రణయ్‌తేజరెడ్డి, అభిలాష్, చరణ్, సిద్ధార్థ, సంజయ్‌కుమార్, జనార్ధన్, హర్షవర్ధన్, శ్రీనాథ్, జయంట్, వరుణ్, సాయినాయుడు, గోవర్ధన్, అభిలాష్.

బాలికలు: హన్సి రెడ్డి, గీతికా రాయల్, అమూల్య, హర్షియా, తాజ్, కీర్తన, ధారమోహన్, కార్తిక, మన్విత, మదనికా, నందిని, చరిత, యశస్విని, రిషిత, రేఖ, భూమి, సౌమ్య.

బాస్కెట్ బాల్ బాలురు:

సంజయ్‌రెడ్డి, విజయ్, సాయిహర్ష, మహమ్మద్ ఖాజా, అబ్దుల్ కరీం, హర్షవర్ధన్, షాహిద్ అఫ్రిది, చరణ్, సాయికుమార్, దినేష్‌కుమార్‌రెడ్డి, భరత్, సాత్విక్.

బాలికలు: పరిమళ, యామిని, యశస్విని, అలేఖ్య, రితిక, సాయిజోష్న, గీత, కల్పన, స్నేహ, ఉమాలక్ష్మి, కీర్తి, హారిక.

టెట్ నుంచి మినహాయించండి

అనంతపురం సిటీ: ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010, సెప్టెంబర్ 30లోపు ఎంపికైన వారికి టెట్ పరీక్ష తప్పనిసరంటూ సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ అంశానికి సంబంధించి కోర్టు ద్వారానే ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చేలా పోరాడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్‌సీ ప్రకటనలో జాప్యం కారణంగా ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, భోజనం తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. బుధవారం మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ పాఠశాలల్లో గ్లోబల్ హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల డయేరియా, టైఫాయిడ్ మొదలగు వ్యాధులు వస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్, పంచాయతీ సెక్రటరీ సాదిక్ వలి పాల్గొన్నారు.

హంపాపురంలో గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే

రాప్తాడు: చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని హంపాపురం జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల కలిగే లాభాలు వివరించారు. భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, లేకపోతే అనారోగ్యం బారిన పడతారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

రామగిరి: స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలో నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 5జీ నెట్‌వర్క్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, ఎంఎస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్రాడ్‌బాండ్ కోర్సుల్లో నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ సమయంలో భోజన సదుపాయం కూడా కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 950575 7136, 6363039978 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యంతోనే యువతకు బంగారు భవిత

అనంతపురం సిటీ: నైపుణ్య శిక్షణ యువత బంగారు భవితకు ఎంతగానో దోహదపడుతున్నట్లు నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్(నాక్–ఏపీ) అదనపు డైరెక్టర్ జనరల్ మనోహర్, డిప్యూటీ డైరెక్టర్ మురళీధర్ అన్నారు. అనంతపురంలోని నాక్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించారు. స్కిల్ హబ్, ప్రధాన్ మంత్రి వికాస్ యోజన (పీఎంవీకే) శిక్షణ పొందుతున్న అభ్యర్థులనుద్దేశించి మాట్లాడారు. వారితో ముఖాముఖి ముచ్చటించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, శిక్షణ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ సాక్షిగా విధులకు డుమ్మా



పీజీ వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యుల పనితీరులో ఏమాత్రమూ మార్పు రావడం లేదు. విధులకు యథేచ్ఛగా డుమ్మా కొడుతున్నారు. స్వయాన కలెక్టర్ ఆనంద్ తనిఖీలకు వచ్చిన సందర్భంలోనూ పలువురు వైద్యులు విధుల్లో ఉండకపోవడం గమనార్హం. బుధవారం కలెక్టర్ సర్వజనాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట ఆయన క్యాజువాలిటీకి వెళ్లారు. అక్కడ అందుతున్న సేవలు, రోగులను సకాలంలో వార్డులకు పంపుతున్నారా, లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆర్థో ఓపీకి వెళ్లారు. ఉదయం పది గంటలైనా ఆర్థో ఓపీలో రెగ్యులర్ వైద్యులు కన్పించలేదు. పీజీ వైద్యులు మాత్రమే ఉన్నారు. కాసేపటికి ఆర్థో విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ సతీష్ తదితరులు మెల్లగా కలెక్టర్ ముందుకు వచ్చారు. తర్వాత కలెక్టర్ చిన్నపిల్లల వార్డును పరిశీలించగా.. ఒకే మంచంపై ఇద్దరు పిల్లలను ఉంచిన దృశ్యాలు కన్పించాయి. ఇలా చేయడం వల్ల క్రాస్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం ఉంది కదా అని హెచ్‌ఓడీ డాక్టర్ రవికుమార్‌ను ప్రశ్నించారు. రెండు యూనిట్లు ఉండగా.. అంతకు మూడింతల అడ్మిషన్లు ఉంటున్నాయని, అందువల్లే ఇలా చేయాల్సి వస్తోందని ఆయన వివరించారు. మెడిసిన్ విభాగంలో ఎఫ్ఎం వార్డును తనిఖీ చేసిన కలెక్టర్.. అక్కడ రోగులకందుతున్న సేవలపై ఆరా తీశారు. సాక్షాత్తు కలెక్టర్ వచ్చినా..మెడిసిన్ వైద్యులు అక్కడికి రాకపోవడం గమనార్హం. అందుబాటులో ఉండాల్సిన యూనిట్– 2 అసిస్టెంట్ ప్రొఫెసర్లు పత్తా కన్పించలేదు.విధుల్లో ఉన్న పీజీ డాక్టరే కలెక్టర్‌కు అక్కడి పరిస్థితులను వివరించారు. నాలుగు నుంచి ఐదు రోజుల పాటు అడ్మిషన్‌లో ఉన్న రోగులను చూయించాలని కలెక్టర్ అడగ్గా.. ఎవరూ లేరని పీజీ డాక్టర్ చెప్పారు. దీంతో కలెక్టర్ ఆశ్చర్యపోయారు. అడ్మిషన్ అయిన రెండ్రోజుల్లోనే రోగుల ఆరోగ్యం మెరుగు పడుతోందా? అంతటి సేవలు ఇక్కడ అందుతున్నాయా అని కలెక్టర్ ప్రశ్నించారు. దీంతో సదరు పీజీ డాక్టర్ ఎటువంటి సమాధానమూ చెప్పకుండా మిన్నకుండిపోయారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం టవర్‌క్లాక్: అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శప్రాయుడని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేదరికంలో జన్మించినా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య, నంద కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కలాం చిత్రపటానికి అధికారులు, పాఠకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శి రమ మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు పొందిన కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. శాస్త్రవేత్తగా, ఇంజినీరుగా, రాష్ట్రపతిగా విభిన్న రంగాలను ప్రభావితం చేసిన అబ్దుల్ కలాం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు కమ్మన్న, గోవిందు, రామాంజనమ్మ, కిరణ్, జీవన తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

అనంతపురం: కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనంతపురం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. కర్నూలు పర్యటనకు వస్తున్న మోదీ రాయలసీమ ప్రజల ఆకాంక్ష హైకోర్టు ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ నెల 18వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నామన్నారు. 1953లో ఆంధ్ర రాష్ట్ర రాజధాని కర్నూలు అని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956లో ఆవిర్భవించడంతో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రాజధానిని తరలించారని గుర్తు చేశారు. రాజధాని ఆంధ్రా ప్రాంతంలో ఏర్పాటైతే హైకోర్టు సీమలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సీమలో రాజధాని ఏర్పాటు అయితే.. ఆంధ్రా ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని పెద్ద మనుషుల ఒప్పందం కూడా జరిగిందని చెప్పారు. ఈ మేరకు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి పెద్ద మనుషుల ఒప్పందం అమలు చేయాలని కోరారు. హైకోర్టును విజయవాడలో ఏర్పాటు చేయడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంతపురం బార్ అసోసియేషన్ కార్యదర్శి ఈ.వెంకట్రాముడు, న్యాయవాదులు జి. ఉమాపతి, జి. నాగన్న, రాంకిశోర్ రెడ్డి, ఈ. శ్రీనివాస రెడ్డి, సజల బాను పాల్గొన్నారు.

పెయ్యదూడల సంతతి పెంపుపై దృష్టి

అనంతపురం అగ్రికల్చర్: గో, గేదె జాతుల పెయ్యదూడల సంతతి పెంపు కోసం పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన లింగనిర్ధారణ వీర్యం (సెక్స్ సార్టెడ్ సెమన్) ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రేమ్‌చంద్ ఆదేశించారు. బుధవారం స్థానిక పశుశాఖ కార్యాలయంలో డీడీలు, ఏడీలు, వీఏఎస్‌లతో ఆయన సమావేశమై మాట్లాడారు. గతంలో సాధారణ కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా పెద్దగా ఫలితాలు రాలేదన్నారు. లింగ నిర్ధారణ ద్వారా 90 శాతం పెయ్యదూడలు జన్మిస్తున్నాయని తెలిపారు. ఉచితంగా అందిస్తున్న ఈ సౌలభ్యాన్ని రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. అంటు, సీజనల్ వ్యాధులు, ఇతర జబ్బుల నివారణకు క్రమం తప్పకుండా టీకాల (వ్యాక్సినేషన్ల) కార్యక్రమాన్ని చేపట్టి, వంద శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ నాగలింగేశ్వరరెడ్డి, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ జి.వెంకటేష్, ఏడీడీఎల్ ఏడీ డాక్టర్ జి.రవిబాబు, ఏడీలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రత్నకుమార్, టెక్నికల్ వీఏఎస్ డాక్టర్ గోల్డ్‌మన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాలతో చెలగాటమాడొద్దు

అనంతపురం సిటీ: ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానం అమలుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్లడం క్షమించరానిదని హెచ్చరించారు. ఈ విధానంతో పేద, మధ్య తరగతి వర్గాల వారిని ఉచిత వైద్యానికి దూరం చేయడమేనని, ఇలాగైతే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ ఏంటని ప్రశ్నించారు. అనంతపురంలోని నీలం రాజశేఖరరెడ్డి భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడారు. వెంటనే పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు విద్యా రంగానికి సంబంధించి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు సంబంధించి రూ.6400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే విద్యార్థుల ఉన్నత చదువులకు దూరం చేసే జీఓ నంబర్: 77ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాకపోవడం శోచనీయమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలతో పాటు కేజీబీవీ మోడల్ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను కూడా భర్తీ చేయాలన్నారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22 నుంచి ఇచ్ఛాపురంలో ప్రారంభమై నవంబర్ 12న అనంతపురంలో ముగిసే రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన ంతరం బస్సు యాత్రకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేశ్ తదితరులు పాల్గొన్నారు.